క్లుప్తంగా

క్షీరాభిషేకం



సంగెం : తమకు గౌరవ వేతనం పెంచినందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి సోమవారం వీఓఏలు క్షీరాభిషేకం చేశారు. మండల కేంద్రంలోని శాంతి మండల సమాఖ్య కార్యాలయంలో సీఎం, పరకాల ఎమ్మెల్యే ధర్మారెడ్డి చిత్రపటానికి మండల వీఓఏల అధ్యక్షురాలు సమ్మెట కృష్ణవేణి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమకు గతంలో ఇచ్చే రూ.3,900ల నుంచి రూ.7,900లకు పెంచినందుకు సీఎంకు రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కోడూరి రమేష్, కోశాధికారి జెండా వాణి, ఉపాధ్యక్షులు మేడి విజయ, కమిటీ సభ్యులు పాలకుర్తి విజయ్, రాము, సువర్ణ, ప్రభాకర్, లక్ష్మి, స్వరూప, రాధిక, రాజు, శారద, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



చెన్నారావుపేట : మండలంలోని ఎల్లాయగూడెం గ్రామంలో నిర్వహించే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విజయవంతం చేయాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులు ఓం ప్రకాష్ అన్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఎస్సై తోట మహేందర్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 6న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు, 11న ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్, శశిరేఖ, నిర్మల, శరత్, పద్మ, కట్టయ్య, నర్సింహరావు, రోహిణి ఉన్నారు.

గుడుంబా స్వాధీనం



దుగ్గొండి : మండలంలోని గుడ్డెలుగుపల్లి గ్రామానికి చెందిన జుగునూరి వంశీ తన కిరాణం షాపులో అక్రమంగా నిషేధిత గుడుంబాను విక్రయిస్తున్నాడన్న సమాచారంతో సోమవారం దాడి చేయగా 30 లీటర్ల గుడుంబా లభ్యమైంది. నిందితుడు వంశీపై కేసు నమోదు చేసి, గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పరమేష్ తెలిపారు. ఈ దాడిలో పోలీసులు ఉన్నారు.

బాలుడికి పాముకాటు

వర్ధన్నపేట : మండలంలోని కట్య్రాల గ్రామానికి చెందిన చేవెళ్ల ఆదిత్య సోమవారం వరికుప్పలు తీస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే బాలుడిని వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక వైద్యం నిర్వహించి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అంబులెన్స్ టెక్నీషియన్ కొత్తూరి సదానందం, పైలట్ చల్ల రాజురెడ్డి అంబులెన్స్‌లో ప్రాథమిక చికిత్స అందించడంతో బాలుడు ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడని బాలుడి తల్లిదండ్రులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నేడు(మంగళవారం) మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మోతె కళావతి అధ్యక్షతన ఉదయం 10.30గంటలకు సర్వ సభ్య సమావేశం ఉంటుందని, అధికారులు, ప్రజా ప్రతినిధులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మామునూరు : యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవనం, సుఖ సంతోషాలు, మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతి కేడెట్ యోగా ఆసనాలను వేయాలని ప్రముఖ యోగా శిక్షణ నిపుణుడు సత్తయ్య సూచించారు. ఖిలావరంగల్ మండలం మామునూరులోని పోలీసు శిక్షణ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ 10వ బెటాలియన్ కమాండెంట్, కల్నల్ అజయ్ నంద ఖండూరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ కేడెట్ల శిక్షణ శిబిరం సోమవారం నాలుగో రోజుకు చేరుకుంది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై ఎన్‌సీసీ శిక్షణ క్యాంప్‌ను సందర్శించారు. ఎన్‌సీసీ కేడెట్లకు యోగా ఆసనాలు వేయించి, యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. యోగా మానవ మనుగడకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై మోటివేషన్ స్పీకర్ డాక్టర్ ఆచార్య రవికుమార్ వివరించారు. సదానందం, సుహస్తదం, రాధాకృష్ణ, రాజయ్య, వెంకటేష్, అనిల్, జీవన్, వివ, రాజమాణిక్యం, సృజన, అనితలత, సౌరస్య సతీష్, సందీప్, ఖదం, శ్రీనివాస్ నారాయణరెడ్డి, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

అందని నష్టపరిహారం

- దరఖాస్తు చేసినా పట్టించుకోని వైనం
- ఆందోళనలో అన్నదాతలు
- న్యాయం చేయాలని వేడుకోలు



ఖానాపురం రైతువేదిక వద్ద చెక్కుల కోసం బారులుదీరిన రైతులు

ఖానాపురం : ఆరుగాలం కష్టపడ్డ రైతులు అకాల వర్షాలతో ఆగమాగమయ్యారు.. సాగు చేసిన పంటంతా వర్షం బారిన పడి దెబ్బతిన్నాయి.. రైతులకు ఆశలు లేకుండా చేసింది వడగళ్ల వాన.. అప్పులు చేసి కొంత మంది సాగు చేస్తే.. పంటలను నమ్ముకొని వేల రూపాయల పెట్టుబడులు పెట్టి దిగుబడులపై ఆశలు పెంచుకున్నారు మరికొందరు.. కానీ వడగళ్ల వానలు రైతులను నిండా ముంచడంతో ప్రభుత్వం నుంచి అండగా నిలుస్తామని భరోసా కల్పించింది.. కానీ పలువురు రైతులకు పరిహారం అందక ఆందోళన చెందుతున్న పరిస్థితి నెలకొంది.

ఖానాపురం మండలంలో రైతులు సాగు చేసిన పంటలు వడగళ్ల వర్షాలతో ధ్వంసమైంది. మండలంలోని పలు గ్రామాల పరిధితో పాటు మరీ ఎక్కువగా కొత్తూరు వైపు రైతులకు వానాలతో నష్టం జరిగింది. దీంతో రైతులను ఓదార్చడానికి నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను నియోజకవర్గానికి రప్పించి పంట నష్టపరిహారం ప్రకటన చేయించి సర్వేలకు ఆదేశించారు. దీంతో వ్యవసాయ అధికారులు సర్వేలు చేసి రైతుల వద్ద వివరాలు సేకరించారు. నేరుగా రైతువేదికల వద్దకు వచ్చి సైతం వివరాలు అందించారు. సమయం ముగిసినా ఇంకా మిగిలిన రైతులు ఎవరైనా ఉంటే వివరాలు అందించాలని ఎమ్మెల్యే పెద్ది ప్రత్యేకంగా రైతులకు అవగాహన సైతం కల్పించారు. తీరా చెక్కులు మంజూరై వచ్చిన తర్వాత జాబితాను పరిశీలిస్తే మండలంలోని కొత్తూరు, రాగంపేట, ఐనపల్లి, బుధరావుపేటతో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులకు పరిహారం చెక్కులు రాకపోవడంతో ఇటీవల వ్యవసాయ అధికారులతోనూ వాగ్వాదానికి దిగారు. పంటలు అధికంగా నష్టపోయిన రైతులకు పరిహారం రాకపోవడంతో ఆందోళన చెందుతూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇక తమకు పరిహారం అందనట్లేనా.. తమకు న్యాయం జరిగేదెలా.. అంటూ తోటి రైతులతో బాధపడుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిహారం ఇవ్వాలన్నారు.

పది ఎకరాలకు రాలేదు



నాకున్న మూడెకరాల భూమితో పాటు మరో పది ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నా.. వడగళ్ల వానతో పంటంతా నష్ట పోయాను. దీంతో మండల వ్యవసాయ అధికారులకు అన్ని వివరాలు అందించా. మూడెకరాల సొంత భూమికి పరిహారం వచ్చింది. పది ఎకరాల కౌలు భూమికి నయా పైసా పరిహారం రాలేదు. అధికారులను అడిగినా ఏం చెప్తలేరు. పంటలు నష్టపోయి ఆర్థికంగా ఇబ్బంది పడ్డా.

- మండల కోటి, రైతు, కొత్తూరు

పరిహారం ఇవ్వాలి



ఐనపల్లి శివారులో మూడెకరాల భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నా.. వడగళ్ల వర్షాలతో పంటంతా నష్టపోయాను. ప్రభుత్వం పరిహారం ఇస్తామనడంతో వివరాలు వ్యవసాయ అధికారులకు అందించా. తీరా చెక్కులు వచ్చాయని తెల్వడంతో అధికారుల వద్దకు వెళ్లి అడగడంతో రాలేదని చెప్పారు. ఏం జరిగిందో తెలియక అడగటం మానేశా. అధికారులు, ప్రభుత్వం స్పందించి పరిహారం ఇవ్వాలి.

- ఎలిజెర్ల బుచ్చయ్య, ఖానాపురం

సంక్షేమ ఫలాల ఘనత కేసీఆర్‌దే

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



సంగెం: చింతలపల్లిలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

సంగెం : రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలను అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చింతలపల్లి, నర్సానగర్, తిమ్మాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన 914 మంది రైతులకు రూ.86లక్షల 75వేల విలువైన చెక్కులను అందజేసి ఆయా గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని రైతులకు ఇబ్బందులు లేకుండా పంట పెట్టుబడి సాయం, రైతు బంధు, పంటలు నష్టపోతే దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా ఎకరాకు రూ.10వేల పరిహారం అందించారన్నారు. పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తీసుకువచ్చారన్నారు. తెలంగాణ అభివృద్ధికి పైసా పనిచేయని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకి వస్తే తిరగనివ్వద్దన్నారు. రైతును రాజు చేయాలని సీఎం కేసీఆర్ చూస్తుంటే కాంగ్రెస్ పార్టీ 3 గంటల కరెంట్ చాలని, బీజేపీ వ్యవసాయ బావులకు మీటర్లు బిగించాలని అంటున్నాయని ప్రజలు గమనించాలని మూడు పంటలకు నీళ్ల కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్ పార్టీ కావాలో ఆలోచించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్‌లు రవికుమార్, చత్రు నాయక్, శారద, ఎంపీటీసీ పావని, ఉప సర్పంచ్‌లు రాధిక, వెంకటేశ్వర్లు, సారంగం, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన మైనార్టీ నాయకులు

గీసుకొండ : గీసుకొండకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో బీఆర్ఎస్ మండల నాయకుడు రడం భరత్, వైస్ ఎంపీపీ శ్రావ్యల ఆధ్వర్యంలో జావిద్, యాకూబ్‌పాషా, షరీఫ్, ఖాజా మోహిపాషాలతో పాటు పలువురు పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు.

‘కేసులు పెట్టించడం సరికాదు’



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌రావు

పర్వతగిరి : సొంత పార్టీ నాయకులపై కేసులు పెట్టించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు మండిపడ్డారు. ఈ మేరకు మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గతంలో ఎన్నడూ లేని విధంగా అధికార పార్టీ నేతలతో కుమ్మక్కై కేసులు పెట్టిస్తున్నారని మండిపడ్డారు. పార్టీలో చిన్నపాటి తగాదాలు సహజమని, వాటిని సరిదిద్దుకోవాల్సిన నాయకులు ప్రోత్సహిస్తూ కేసులు పెట్టిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని నామరూపాలు లేకుండా చేశారని, ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్నందున మళ్లీ కుమ్మక్కు రాజకీయాలకు తెరతీశారని అన్నారు. వెంటనే అక్రమంగా బనాయించిన కేసులను ఉపసంహరించుకోవాలని లేదా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, నాయకులు వెంకటరెడ్డి, సునీల్ రావు, మహేంద్ర, రామచందర్, సుధాకర్, రమేష్, భాస్కర్ నాయక్, లచ్చు నాయక్, పంతులు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులకు బీఆర్ఎస్ చేయూత

- ఎమ్మెల్యే అరూరి రమేశ్



చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే రమేశ్

వర్ధన్నపేట : కులవృత్తులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్న ప్రభుత్వం బీఆర్ఎస్ మాత్రమేనని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని నల్లబెల్లి, రాంధన్‌తండా గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి నల్లబెల్లి చెరువులో రూ.4.24 లక్షల విలువ గల చేప పిల్లలను వదిలారు. అనంతరం ముదిరాజ్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.10లక్షల నిధులు మంజూరు ప్రొసీడింగ్ కాపీ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులవృత్తులను ప్రోత్సహించడంలో భాగంగా మత్స్యకారులను, రజకులను గతంలో పలు పథకాల ద్వారా ఆదుకోవడం జరిగిందన్నారు. బీసీ బంధు పథకం ద్వారా రూ.లక్ష ప్రోత్సహకాన్ని అందిస్తున్నామన్నారు. రైతులను, దళితులతో పాటు మైనారిటీలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించి దేశంలోనే ఆదర్శంగా నిలవడం జరుగుతుందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వం మద్దతు ధర అందించి ఆదుకుంటుందన్నారు. రైతులు అప్పులు చేసి అవి తీర్చలేని పరిస్థితిని గమనించి రూ.లక్ష రుణమాఫీ చేశామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, సర్పంచ్ ముత్యం దేవేంద్ర సంపత్, ఎంపీటీసీ దుగ్యాల జ్యోతి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన మాస్కుల కుమారస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా 1993–94లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ. 50వేల నగదును బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం అందజేసి ఔదార్యాన్ని చాటారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై..

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నియోజకవర్గంలోని ఎంతో మంది బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నర్సంపేట పట్టణంలోని 18వ వార్డు లెనిన్ నగర్‌కు చెందిన కాంగ్రెస్, సీపీఎం కార్యకర్తలు, నెక్కొండ మండలం అప్పల్‌రావుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్, ఇతర పార్టీల బాధ్యులు, దుగ్గొండి మండలం రేబల్లె గ్రామానికి చెందిన కాంగ్రెస్, ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు, చెన్నారావుపేట మండలం లింగాపురం గ్రామం కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రధాన అనుచరులతో పాటు పలువురు, ఖానాపురం మండలం పాకాల అశోక్‌నగర్ గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన పలు కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటస్వామి, ఎంపీపీ, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీటీసీలు, క్లస్టర్ బాధ్యులు, వార్డు అధ్యక్షులు, సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

వైద్యం చేయించుకునే ఆర్థికస్తోమత లేని పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు రూ.5.90లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పథకం కింద వర్తించని అనేక రోగాలకు సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్ఓసీ ద్వారా పేదలు వైద్యం చేయించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, వార్డు సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఎంపిక



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న చెన్నారెడ్డి

చెన్నారావుపేట : దళిత బంధు, గృహలక్ష్మి, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ రుణాలు, బీసీ కులవృత్తుల లబ్ధిదారుల ఎంపిక నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని జల్లీ గ్రామానికి చెందిన తొగరు చెన్నారెడ్డి అన్నారు. ఈ మేరకు ఎంపీడీఓకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ పంచాయతీ రాజ్ యాక్ట్–2018, సెక్షన్–8 ప్రకారం గ్రామసభ నిర్వహించి అర్హత కలిగిన లబ్ధిదారులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఉందన్నారు. 2023–24 సంవత్సరానికి మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన పథకాల ఎంపికలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అర్హత కలిగిన వారికి అన్యాయం చేస్తున్నారని అన్నారు. లబ్ధిదారుల ఎంపికలో వ్యక్తగత నిర్ణయాలకు తావులేకుండా చట్టబద్ధంగా ఎంపికచేయాలని లేని ఎడల తమరిపై కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. యువకులు తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై వీరభద్రరావు

పర్వతగిరి : ఈ నెల 9వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ పర్వతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులకు సంబంధించిన వారు వరంగల్ జిల్లా న్యాయ స్థానంలో ఈనెల 9వ తేదీన జరగబోవు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు. క్రిమినల్, సివిల్ కేసులతో పాటు భూతగాదా కేసులు, చిట్‌ఫండ్, రోడ్డు ప్రమాదాలు, ఎక్సైజ్, వివాహ, కుటుంబ తగాదాలు, ట్రాఫిక్ చలాన్ కేసులతో పాటు ఇతర రాజీపడదగు కేసులను కక్షిదారులు రాజీమార్గంలో తమ సివిల్, క్రిమినల్ కేసులను సత్వరమే పరిష్కరించుకోవాలన్నారు. ట్రాఫిక్ కేసులకు సంబంధించిన డ్రంకెన్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్‌కు పాల్పడిన కేసులను లోక్ అదాలత్ ద్వారా వేగంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపిన కేసుల్లో సదరు వాహన దారుడు ఆధార్ కార్డు జిరాక్స్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన కేసుల్లో వాహనదారుడు ఆధార్ కార్డుతోపాటు మీ సేవలో లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న రశీదు, మైనర్ డ్రైవింగ్ కేసుల్లో ఉన్న వారు జనన ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మెమోలతో కోర్టుకు రావాల్సి ఉంటుందని ఎస్సై తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రులపై చర్య తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు

నర్సంపేట : గ్రామీణ ప్రాంతాల్లో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులను అరికట్టి, పేదల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి చిర్ర సూరి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయ డీఏఓ టి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత వైద్యశాఖ అధికారులు గ్రామీణ ప్రాంత పేదలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దీంతో దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల వారు జ్వరాలతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తే అక్కడ యజమాన్యాలు, డాక్టర్లు రకరకాల పరీక్షలతో తీవ్ర ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత వైద్యశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా కొనసాగుతున్న ప్రైవేటు ఆస్పత్రుల గుర్తింపును రద్దు చేయాలని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని, గ్రామీణ ప్రాంతాల్లో రెగ్యూలర్‌గా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కొడెం సారంగపాణి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అద్దూరి రాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మైదం పాణి, ఐఎఫ్‌టీయూ డివిజన్ నాయకులు జవహర్‌లాల్, మనోహరచారి పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా శేఖర్



చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా, వైస్ ప్రిన్సిపాల్‌గా గుగులోత్ శేఖర్ విధులు నిర్వహిస్తున్నాడు. పాఠశాలలో హరితహారం, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, బడిమానేసిన పిల్లలను బడిలో చేర్పించడం, మధ్యాహ్న భోజనం వంటి అంశాలలో అందిస్తున్న సేవలకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా డీఈఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ సోమవారం ఎంపిక చేసింది. దీంతో ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

వల్మిడికి తరలిన భక్తులు



రాయపర్తి : పాలకుర్తి మండలంలోని వల్మిడి గ్రామంలో సీతారామచంద్రస్వామి ఆలయ ప్రారంభోత్సవానికి సోమవారం మండలం నుంచి భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని పెర్కవేడు, మైలారం, తిర్మలాయపల్లి, కొండూరు తదితర గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాల్లో భక్తులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, సర్పంచ్ గారె నర్సయ్య, ఎంపీటీసీ ఐత రాంచందర్, మంత్రి పీఏ సారంగం, ముద్రబోయిన సుధాకర్, చిన్నాల రాజబాబు, వీరస్వామి, రామారావు, వేణు, మల్యాల నర్సింహమూర్తి తదితరులు తరలివెళ్లారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం సంఘం నాయకులు

గీసుకొండ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం ఎదుట నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం ధర్నా చేపట్టారు. ఎన్‌హెచ్‌ఎం పథకంలో పని చేస్తున్న స్టాఫ్ నర్సు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, అకౌంటెంట్, సపోర్టింగ్ స్టాఫ్, తదితర కేడర్లకు చెందిన వారి సర్వీసులను రెగ్యులర్ చేయాలంటూ ఐదు రోజుల నుంచి చేస్తున్న సమ్మెలో భాగంగా ఆందోళన చేపట్టారు. ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఎన్‌హెచ్‌ఎం ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి రామరాజేశ్ ఖన్నా, నాయకులు శ్రీబాద్రివేణు, బండి రాజేష్, మార్క రాజేష్, అర్చన, జ్యోత్స్న, రుబీనా, కళ్యాణి, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.